రబీ సాగుకు సన్నద్ధం

- నియోజకవర్గంలో 40 వేల ఎకరాల్లో రబీ సాగు
- భూములను సిద్ధం చేసుకుంటున్న రైతులు
- ఈఏడాది తగ్గనున్న సాగు విస్తీర్ణం


రబీ సాగుకు చదును చేసిన భూమి

ఆదిలాబాద్‌రూరల్: వానాకాలంలో సోయాబీన్ పంటలు సాగు చేసిన రైతన్నలు రబీ సాగుకు సన్నద్ధమవుతున్నారు. ఆదిలాబాద్ నియోజకవర్గంలోని ఆదిలాబాద్ రూరల్, మావల, జైనథ్, బేల మండలంలో వానాకాలంలో సుమారు 40వేల ఎకరాలలో సోయాబీన్ పంట సాగు అయినట్లు వ్యవసాయాధికారులు పేర్కొంటున్నారు. ఇందులో 30 నుంచి 40 శాతం సోయాబీన్ పంట వేశారు. నవంబర్ మొదటి వారంలో నియోజకవర్గంలో సోయాబీన్‌ను పూర్తిగా తొలగించనున్నారు. రబీలో శనగ, జొన్న ప్రధాన పంటలు సాగు చేసేందుకు మొగ్గు చూపతున్నారు. కొంత మేర మినుములు, పెసర్లు సాగు చేయనున్నారు.

40 వేల ఎకరాల్లో సాగు..

వానాకాలం సోయాబీన్ పండించిన రైతులు రబీలో రెండో శనగ, జొన్న పంటలను సాగు చేయనున్నారు. ఆదిలాబాద్ రూరల్ మండలంలో 8 వేల ఎకరాలు, మావలలో 500 ఎకరాలు, జైనథ్ మండలంలో 20 వేల ఎకరాలు, బేల 10 వేల ఎకరాల చొప్పున సాగు చేయనున్నట్లు వ్యవసాయాధికారులు అంచనా వేస్తున్నారు. గత ఏడాది కంటే ఈఏడాది పత్తి సాగుకే ప్రాధాన్యత ఇచ్చినట్లు పేర్కొంటున్నారు. దీనిని బట్టి చూస్తే గత ఏడాది కంటే ఈఏడాది రబీ సాగు తగ్గనుంది.

శనగ, జొన్న వైపే మొగ్గు..

రబీ సాగు కోసం రైతన్నలు సోయాబీన్ పంటను తొలగించి శనగ, జొన్న సాగు కోసం వారి వ్యవసాయ భూములను సిద్ధం చేసుకుంటున్నారు. నీటి వసతి కలిగిన కొంత మంది రైతులు శనగ పంటతో పాటు కొంత మేర గోధుమ సాగు చేయనున్నారు. శనగ పంట సాగు కోసం అంతగా నీటి తడి ఇవ్వాల్సిన అవసరం ఉండదు. మంచుతో శనగ పంట సాగు అయ్యే అవకాశం ఉంటుంది. గత ఏడాది చివరి సమయంలో పత్తి పంటకు ధర అధికంగా పలుకడంతో రైతులు ఈసారి పత్తి పంట సాగును పెంచారు.

చేతికి వస్తున్న సోయా



వానాకాలంలో సోయాబీన్ పంట సాగు చేసిన రైతులు రబీలో శనగ, జొన్న పంటలను సాగు చేయనున్నారు. ఇప్పటికే 30 నుంచి 40 శాతం సోయాబీన్ హార్వెస్టింగ్ పూర్తవుతుంది. నవంబర్ అనంతరం రబీ సాగు ప్రారంభం అవుతుంది.

– అష్రఫ్, మండల వ్యవసాయ అధికారి, ఆదిలాబాద్‌రూరల్

అభివృద్ధిని చూసి పార్టీలో చేరుతున్నారు


కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే

ఆదిలాబాద్‌టౌన్: సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధిని చూసి ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నారని ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. బుధవారం ఆదిలాబాద్ పట్టణంలోని పార్టీ కార్యాలయంలో పలువురు బీఆర్ఎస్ చేరారు. వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంత రం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మేనిఫెస్టోలో రూ. 400లకే గ్యాస్ అందిస్తామని, సౌభాగ్య లక్ష్మీతో ప్ర తి మహిళకు రూ.3 వేలు, అమ్మఒడితో పాటు తది తర పథకాలను ప్రవేశపెడుతామన్నారు. కార్యక్రమంలో నాయకులు ఇజ్జగిరి నారాయణ, సలీమ్, అజయ్, అరుణ, మల్లేష్, ప్రకాష్ పాల్గొన్నారు.

అనిల్ జాదవ్‌ను గెలిపించాలి

తలమడుగు: ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి అనిల్ జాదవ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. బుధవారం మండలంలోని దేవాపూర్‌లో బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఉండమ్ గ్రామంలోని ఆయుష గార్డెన్‌లో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ప్రతీ బీఆర్ఎస్ కార్యకర్త సైనికుల్లా పని చేయాలన్నారు. బోథ్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి అనిల్ జాదవ్, మాజీ ఎంపీ గోడం నగేశ్, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, తోట వెంకటేశ్, మొట్టె కిరణ్‌కుమార్, పిడుగు, సంజీవ్‌రెడ్డి, వసంత్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, గంగాధర్ పాల్గొన్నారు.

'రాజకీయంగా చైతన్యం కావాలి'


కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న గణేష్ మహరాజ్

ఆదిలాబాద్‌రూరల్: బీసీ, ఎస్సీ, ఎస్టీలు రాజకీయంగా చైతన్యం కావాలని డీఎస్పీ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు అగ్గిమల్ల గణేష్ మహరాజ్ అన్నారు. బుధవారం జిల్లాకు చెందిన పలువురు ఆదివాసీ నాయకులు ధర్మసమాజ్ పార్టీలో చేరారు. వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వెనుకబడిన కులాలను అగ్రకులాలు దోపిడీ చేస్తున్నాయని విమర్శించారు. ఆదిలాబాద్ జిల్లాలో దోపిడీకి గురవుతున్న కులాలను చైతన్యం చేస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ధర్మ సమాజ్ పార్టీ ఆదిలాబాద్ జిల్లా సభ్యులు, బోథ్ అసెంబ్లీ ప్రచార కమిటీ సభ్యులు కొండమడుగు గణేష్, బడుగు రాజేశ్వర్, అగ్గిమల్ల నవీన్, లక్ష్మణ్, రఘువీర్, ప్రవీణ్, శేఖర్, రాజేశ్వర్, జగదీశ్వర్ పాల్గొన్నారు.

జోరుగా ఎన్నికల ప్రచారం

బోథ్: మండల వ్యాప్తంగా బీఆర్ఎస్ నాయకులు ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరం చేశారు. బుధవారం ఎంపీపీ తుల శ్రీనివాస్ నాగాపూర్, మందబొగడ, అందూర్, బిర్లాగొంది గ్రామాల్లో ప్రచారం నిర్వహించగా.. జెడ్పీటీసీ సంధ్యారాణి బోథ్‌లో ప్రచారం చేశారు. నియోజకవర్గ అభివృద్ధి బీఆర్ఎస్‌తోనే సాధ్యమన్నారు. ఆయా కార్యక్రమాల్లో కార్యక్రమాల్లో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం


ఎన్నికైన సభ్యులు

నేరడిగొండ: మండలంలోని కుమారి గ్రామ దుర్గాదేవీ సేవ సమితి కార్యవర్గాన్ని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. చైర్మన్‌గా బురే రవీందర్ గౌడ్, వైస్ చైర్మన్‌గా కె.శంకర్, క్యాషియర్‌గా శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా రాజేశ్వర్, రైటర్‌గా తులసీదాస్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సభ్యులు పాల్గొన్నారు.

'పేదలకు అండగా బీఆర్ఎస్'


దుస్తులు ఐరన్ చేస్తున్న జోగు ప్రేమేందర్

ఆదిలాబాద్‌టౌన్: బీఆర్ఎస్ పేదలకు అండగా నిలుస్తోందని మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ అన్నారు. ప్రచార కార్యక్రమంలో భాగంగా బుధవారం పట్టణంలోని రిక్షా కాలనీతో పాటు పలువార్డుల్లో ఇంటింటికీ తిరుగుతూ కారు గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. ఎమ్మెల్యే జోగు రామన్నను భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. ప్రతీ ఇంట్లో ఏదో ఒక పథకం ద్వారా లబ్ధి పొందారన్నారు. రిక్షా కాలనీలో రూ.2 కోట్ల 50 లక్షల నిధులతో అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందని వివరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ వెంకన్న, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మెట్టు ప్రహ్లాద్, శివకుమార్ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ పట్టణంలోని వడ్డెర కాలనీకి చెందిన దండ్ల రాయుడు అనే పేద విద్యార్థికి మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ ఆర్థిక సాయం అందజేశాడు. ఇటీవల జరిగిన పీజీ ప్రవేశ పరీక్షలో సత్తా చాటిన సదరు విద్యార్థి నిజాం కళాశాలలో ఎకనామిక్స్ విభాగంలో సీటు సాధించాడు. యువకుడి కుటుంబ ఆర్థిక పరిస్థితిని తెలుసుకున్న చైర్మన్ రూ.10 వేలు అందజేశాడు.

ఎంపీ 'సోయం'ను కలిసిన నాయకులు

తలమడుగు: ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపురావును మండల బీజేపీ నాయకులు జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో కలిశారు. ఇటీవల బీజేపీ బోథ్ నియోజకవర్గ అభ్యర్థి సోయం బాపురావు పేరు ప్రకటించడంతో పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. బీజేపీ యువమోర్చా అధ్యక్షుడు దాతాజీ కిరణ్, మండల ఉపాధ్యక్షుడు చింతల రాజు, పిట్ల శేఖర్, ఆడెపు శ్రీనివాస్, రవి, ఉత్తం పాల్గొన్నారు.

అనారోగ్యంతో మాజీ సర్పంచ్ మృతి


కొండల్‌రావు (ఫైల్)

ఉట్నూర్‌రూరల్: మండలంలోని చీమనాయక్ తండాకు చెందిన నాగాపూర్ పంచాయతీ మాజీ సర్పంచ్ జాదవ్ కొండల్ రావు (80) బుధవారం మృతి చెందారు. కొండల్ రావు గత కొంత కాలంగా అ నారోగ్యంతో బాధపడుతున్నాడు. అనారోగ్యం క్షీణించడంతో నిజామాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లుగా కుటుంబసభ్యులు తెలిపారు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు, కాంగ్రెస్ నాయకులు పెద్ద ఎత్తున చీమనాయక్‌తండాకు చేరుకొని ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు.

ఆదమరిస్తే అంతే..


ఇచ్చోడ: మండలంలోని మల్యాల్, తలమద్రి రోడ్డు మార్గంలోని కల్వర్టు వద్ద రోడ్డు కోతకు గురైంది. రాత్రి వేళలో వాహనదారులు ఆదమరిస్తే చాలు ప్రాణాలు గాలిలో కలిసిపోయే ప్రమాదం ఉంది. సంబంధిత అధికారులు స్పందించి మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

హరీశ్‌రావు సభ విజయవంతం చేయండి


సభ స్థలిని పరిశీలిస్తున్న దండే విఠల్

ఉట్నూర్‌రూరల్: మండల కేంద్రంలోని ఎంపీడీవో గ్రౌండ్‌లో ఈనెల 28న నిర్వహించే మంత్రి హరీశ్‌రావు సభను విజయవంతం చేయాలని నియోజకవర్గ ఇన్‌చార్జి దండే విఠల్, ఎంపీపీ పంద్ర జైవంత్‌రావు అన్నారు. బుధవారం లక్కారంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడా రు. కార్యకర్తలు, నాయకులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. సమావేశంలో మండల అధ్యక్షుడు రమేశ్, ప్రధాన కార్యదర్శి సీతారాం, బీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షుడు ధరణి రాజేశ్, రషీద్, భరత్, అన్సారీలు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు పూర్వ వైభవం


పార్టీలో చేరిన మహిళలతో శ్రీనివాసరెడ్డి

కైలాస్‌నగర్: కాంగ్రెస్‌కు పూర్వ వైభవం సంతరించుకుంటుదని కాంగ్రెస్ నాయకులు కంది శ్రీనివాసరెడ్డి అన్నారు. ఆదిలాబాద్ పట్టణంలోని ప్రజాసేవా భవన్‌లో గురువారం పట్టణంలోనీ శాంతినగర్, శ్రీరాం కాలనీలకు చెందిన పలువురు కాంగ్రెస్‌లో చేరారు. వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించాడు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 15 ఏళ్లుగా జోగు రామన్న ఎమ్మెల్యేగా ఉన్నారని, మార్పు జరిగితే తప్పా... ఆదిలాబాద్ అభివృద్ధి కాదన్నారు. కాంగ్రెస్ హయాంలోనే పేదలకు ఇందిరమ్మ ఇళ్లు వచ్చాయని గుర్తు చేశారు. మళ్లీ అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీలను అమలు చేస్తామన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల వరకు ఉచిత కరెంట్ ఇస్తామన్నారు. ఇల్లు కట్టుకునేందుకు రూ. 5 లక్షల ఆర్థిక సాయం, విద్యార్థులకు విద్యా భరోసా కార్డు ఇస్తామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ ఎస్టీ సెల్ చైర్మన్ ఆనంద్‌రావు, సంతోష్ రావు, సుజాత్ అలీ, షకీల్, రవి, గంగన్న, రాజ్ మహమ్మద్, జంగిలి ప్రవీణ్ పాల్గొన్నారు.

'అవకాశం ఇవ్వండి.. అభివృద్ధి చేస్తా'


ప్రజలతో మాట్లాడుతున్న పాయల్ శంకర్

జైనథ్: రానున్న ఎన్నికల్లో అవకాశం ఇస్తే అభివృద్ధి చేసి చూపిస్తానని బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి పాయల్ శంకర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో కార్యకర్తలు, నాయకులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. జోగు రామన్న మూడుసార్లు ఆదిలాబాద్ ఎమ్మెల్యేగా గెలిచినా.. ఎలాంటి అభివృద్ధి చేయలేదన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముందుకుపోతున్న తనను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కట్కం రాందాస్, లోక ప్రవీణ్ రెడ్డి, భోయర్ విజయ్, అంకత్ రమేశ్, చిల్కూరి జ్యోతి, రత్నాకర్‌రెడ్డి, రతన్ రెడ్డి, కరుణాకర్ రెడ్డి, రాకేశ్‌రెడ్డి, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

సోయా కొనుగోళ్లు ప్రారంభం


బేల: కొనుగోళ్లను ప్రారంభిస్తున్న డీసీవో మోహన్

బేల: మండల కేంద్రంలోని సబ్ మార్కెట్‌యార్డులో బుధవారం నాబార్డు సౌజన్యంతో, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ఆధ్వర్యంలో సోయా కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా రైతులను సన్మానించి, సోయా కొనుగోళ్లను జిల్లా సహకార అధికారి మోహన్ ప్రారంభించారు. సూపరింటెండెంట్ ఆత్మరాం, జైనథ్ మార్కెట్ కమిటీ కార్యదర్శి కాంబ్లే మధుకర్, బేల, డోప్టాల సంఘాల సీఈవోలు తిరుపతి, ఠాక్రే ప్రఫుల్, కార్యదర్శి నిపుంగే గణేష్, తదితరులు పాల్గొన్నారు.

బోథ్: బోథ్ వ్యవసాయ మార్కెట్ పరిధిలో బుధవారం సోయా, మొక్కజొన్న కొనుగోళ్లను ఏఎంసీ కార్యదర్శి దేవన్న, మండల వ్యవసాయాధికారి విశ్వమిత్రలు ప్రారంభించారు. రైతులు నాణ్యమైన పంటను మార్కెట్‌కు తీసుకువచ్చి మద్దతు ధర పొందాలన్నారు. సోయా క్వింటాలుకు రూ. 4600, మొక్కజొన్న క్వింటాలుకు రూ. 2090 ప్రకటించిందన్నారు. సొసైటీ కార్యదర్శులు స్వామి, నాగభూషణం, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఇంద్రవెల్లి మార్కెట్‌లో..

ఇంద్రవెల్లి: మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డులో మార్క్‌ఫెడ్, పీఏసీఎస్ ఆధ్వర్యంలో గురువారం నుంచి సోయా కొనుగోళ్లను ప్రారంభించనున్నట్లు పీఏసీఎస్ సీఈవో ధరంసింగ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర క్వింటాలుకు రూ. 4600తో కొనుగోలు చేయనున్నట్లు పేర్కొన్నారు. తేమ శాతం 12 కన్న తక్కువ ఉండే విధంగా చూసుకోవాలన్నారు.

ముగిసిన దుర్గాదేవీ నవరాత్రోత్సవాలు


పూజలు చేస్తున్న భక్తులు

ఇంద్రవెల్లి: దుర్గదేవీ నవరాత్రి ఉత్సవాలు బుధవారం ముగిశాయి. చివరి రోజు భక్తులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం దుర్గదేవీ విగ్రహాలతో శోభాయాత్ర చేపట్టారు. మహిళలు, యువతులు చేసిన సంప్రదాయ నృత్యం ఆకట్టుకుంది. అనంతరం చెరువుల, వాగుల్లో దుర్గదేవీని నిమజ్జనం చేశారు.

ఆదిలాబాద్‌రూరల్: తాలుకా మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో బుధవారం చేపట్టిన శారదా దేవి నిమజ్జన వేడుకల్లో ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న పాల్గొన్నారు. ప్రత్యేక పూజలు చేసి, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు.

'హామీ ఇచ్చి అన్యాయం చేసిన బీజేపీ'


మాట్లాడుతున్న జానుబాయి

ఖానాపూర్: గిరిజన మహిళ అయిన తనకు టికెట్ ఇస్తామని బీజేపీ అధిష్ఠానం హామీ ఇచ్చి తీవ్ర అన్యాయం చేసిందని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు, పెంబి జెడ్పీటీసీ భూక్యా జానుబాయి ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం పట్టణంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పరిధిలో ఒక్క మహిళకు కూడా టికెట్ ఇవ్వకుండా పార్టీ మహిళల పట్ల వివక్ష చూపుతుందన్నారు. పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి పని చేసిన వారికి కాకుండా సూటుకేసులు ఇచ్చిన వారికి టికెట్ కేటాయించారని ఆరోపించారు. ఖానాపూర్ టికెట్‌పై బీజేపీ అధిష్ఠానం పునరాలోచన చేయాలని కన్నీరుమున్నీరయ్యారు. తనను ఇప్పటివరకు అధిష్ఠానం తరఫున ఎవరూ పలకరించలేదని వాపోయారు. భవిష్యత్తు కార్యచరణను రెండు రోజుల్లో ప్రకటిస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో హపావత్ రాజేందర్, ముక్కెర గంగాధర్, గోపాల్‌రెడ్డి, రామకృష్ణ, భూమారెడ్డి, బైరి శ్రీను పాల్గొన్నారు.

క్లుప్తంగా

తెమడ పరీక్ష చేయించుకోవాలి


తెమడ శాంపిల్ సేకరిస్తున్న ఆశ కార్యకర్తలు

నార్నూర్: అనుమానితులు తప్పనిసరిగా తెమడ పరీక్షలు చేయించుకోవాలని హెల్త్ సూపర్‌వైజర్ చౌహాన్ చరణ్‌దాస్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో తెమడ పరీక్ష శిబిరం నిర్వహించారు. మొత్తం 19 మందికి తెమడ పరీక్ష చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వారం మించిన దగ్గు, బరువు తగ్గడం, ఆకలి మందగించడం, ప్రతిరోజు రాత్రి జ్వరం రావడం, చమటలు రావడం లక్షణాలు ఉంటే ఆశ కార్యకర్తలను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ఎల్‌టీ రవీందర్, ఆశ కార్యకర్తలు గుంపాబాయి, మారుబాయి, అనిత, లక్ష్మి, అ రుణ, చోలే సంగీత, రాథోడ్ శ్రీలత, తది తరులు పాల్గొన్నారు.

'సంక్షేమ పథకాలే గెలిపిస్తాయి'


ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ఇచ్చోడ: సంక్షేమ పథకాలే బీఆర్ఎస్‌ను గెలిపిస్తాయని ఎంపీపీ నిమ్మల ప్రీతంరెడ్డి, మండల కన్వీనర్ ఏనుగు కృష్ణారెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని ఇస్లాంనగర్‌లో ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. దేశంలో ఎక్కడా లేని పథకాలను సీఎం కేసీఆర్ అమలు చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు మోహరాజ్ అహ్మద్, గాడ్గే సుభాష్, పాండరంగ్, తదితరులు పాల్గొన్నారు.

నేరడిగొండ: బీఆర్ఎస్ బోథ్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి అనిల్ జాదవ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని మండల కన్వీనర్ అల్లూరి శివారెడ్డి కోరారు. బుధవారం మండలంలోని గుత్పాల, యాపల్‌గూడ, ఇస్రుగూడ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు జహీర్, రవీందర్ రెడ్డి, లచ్చన్న, ఉప్పు పోశెట్టి, విశాల్, మదన్, నారాయణ, అడెల్లు పాల్గొన్నారు.

ఎడ్లబండిపై ప్రచారం


ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు

ఇంద్రవెల్లి: అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తుండడంతో నాయకులు ఎన్నికల ప్రచారం ముమ్మరం చేశారు. బుధవారం మండల కేంద్రంతో పాటు ఏమాయికుంట గ్రామాల్లో బీజేపీ నాయకులు ఎడ్లబండిపై తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. బీజేపీ అధికారంలోకి వస్తేనే గ్రామాల అభివృద్ధి జరుగుతుందన్నారు. కేంద్ర సంక్షేమ పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు ఆరెల్లి రాజలింగు, రాజు ముండే, విజయ్‌సింగ్ పాల్గొన్నారు.

యువకుల రక్తదానం

తాంసి: అత్యవసర సమయంలో భీంపూర్ మండలానికి చెందిన యువకులు రక్తదానం చేశారు. మండలంలోని వడూర్ గ్రామానికి చెందిన గునుగల లక్ష్మి అనారోగ్యానికి గురై జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుంది. ఆమెకు అత్యవసరంగా రక్తం అవసరం కాగా.. భీంపూర్ మండల అనిల్ జాదవ్ యువసేన అధ్యక్షుడు షేక్ అఫ్రోజ్, యువకుడు నితిన్ ఆస్పత్రికి వెళ్లి రక్తదానం చేశారు.

విధుల్లో అప్రమత్తంగా ఉండాలి


రికార్డులు పరిశీలిస్తున్న సీఐ శ్రీనివాస్

సారంగపూర్: ఎన్నికల వేళ విధులు నిర్వర్తించే సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని నిర్మల్‌రూరల్ సీఐ శ్రీనివాస్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను నిర్మల్‌రూరల్ సీఐ బి.శ్రీనివాస్ తనిఖీ చేశారు. ఈసందర్భంగా రికార్డులను పరిశీలించి ఈనెలలో నమోదైన కేసుల వివరాలు, వాటి పురోగతి గురించి ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం సిబ్బందికి పలు సూచనలు, సలహాలు అందించారు. వారి వెంట సిబ్బంది, తదితరులు ఉన్నారు.